Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 161 | Thusday : 05.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :161 | గురువారం 5 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

# అమరావతి అభివృద్ధి కోసం రెండో దశ



**40 నుంచి 45 వేల వేల ఎకరాల భూమిని సేకరించాలని భావిస్తోంది.**

**స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలను తీసుకునే పనిలో ప్రభుత్వం**

**అమరావతిలో కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది**

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతికి సంబంధించి భవిష్యత్ ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో అమరావతి అభివృద్ధి కోసం రెండో దశలో 40 నుంచి 45 వేల వేల ఎకరాల భూమిని సేకరించాలని భావిస్తోంది. ఈ భూమిని భూ సమీకరణ ద్వారా, భూసేకరణ ద్వారా తీసుకోవాలా అనే అంశాలను పరిశీస్తోంది. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలను తీసుకునే పనిలో ఉన్నారు. అమరావతిలో కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు అవసరం అవుతాయన్నారు మంత్రి నారాయణ. పెట్టుబడిదారులు అమరావతికి రావాలంటే 5 వేల ఎకరాలతో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ఉండాలన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం మరో 2,500 ఎకరాలు కేటాయించాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు విషయంలో చంద్రబాబు అప్పట్లో దూరదృష్టితో ఆలోచించారన్నారు. అప్పట్లోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అన్ని వేల ఎకరాలు ఎందుకు బేగంపేటలో ఉన్న ఎయిర్‌పోర్టు చాలదా? అని విమర్శించారన్నారు. అప్పుడు కనుక శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించకపోతే ఇప్పుడు అక్కడికి వస్తున్న విమానాల్లో పది శాతం కూడా బేగంపేటలో దిగలేవని వ్యాఖ్యానించారు. పెట్టుబడులు రావాలంటే అంతర్జాతీయ విమానాలు దిగేలా ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకే అమరావతిలోనూ 5,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ప్లాన్ చేశామన్నారు. అమరావతి పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో 26,000 ఎకరాలు, తాడికొండ నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో 12,000 ఎకరాలు భూసమీకరణ ద్వారా సేకరించడానికి రైతులు ముందుకు వచ్చారన్నారు మంత్రి నారాయణ. ఈ రెండో విడతలో రాజధాని కోసం భూములు ఇచ్చే రైతులకు మూడేళ్లల్లో మూడేళ్లలో అభివృద్ధి చేసిన స్థలాలు అప్పగిస్తామన్నారు. రాజధానిలో విద్య, వైద్య సంస్థలకు భూముల రిజిస్ట్రేషన్ ఫీజులో మినహాయింపు ఇవ్వాలని సీఆర్డీఏ నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలోని అన్ని నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3,673 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసిన విషయాన్ని తెలిపారు.అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తే ఏడాదికి రెండు మూడు పెద్ద ఈవెంట్లు జరుగుతాయని.. ఇలా దేశ, విదేశాల నుంచి క్రీడాకారులు, ఫ్యాన్స్ వస్తారన్నారు.. అప్పుడు హోటల్స్ కూడా ఏర్పాటవుతాయన్నారు. - మిగతా3లో



## కుల గణనపై కేంద్రం కీలక నిర్ణయం

- తదుపరి దేశ జనాభా గణన 2027, మార్చి ఒకటి నుంచి ప్రారంభం
- 2026 అక్టోబర్ నుంచే లడఖ్, జమ్ముకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో ప్రారంభం
- జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్న ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళల గణాంకాలతో పాటు, వారి కులం, ఉపకులాలపై ప్రభుత్వం సమాచారం సేకరణ



## రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..


- ఫోన్ ట్యాపింగ్‌పై నందకుమార్
- 2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.
- ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆల్రెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది
- ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయింది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నంద కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని.. ఈ విషయంపై అప్పటి డీజీపీ రవి గుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలుద్దామని అనుకున్నానని.. కానీ అపాయింట్‌మెంట్ దొరకలేదని అన్నారు. ఈరోజు (బుధవారం) ఏబీఎన్ – ఆంధ్రజ్యోతితో నందకుమార్ మాట్లాడుతూ.. అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు - మిగతా3లో

# మంత్రులు దూకుడు పెంచాలి

- జనంతో మమేకం కావాలి
- ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారు
- ఇప్పుడు నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు
- ఏడాది పరిపాలన అంతా బాగుందన్నారు
- మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలి
- ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలి
- మనల్ని అన్యాయంగా వేధించారని మనమూ వేధించటం సరికాదు
- గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుపుతాం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని మంత్రులతో సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారన్న చంద్రబాబు.. ఇప్పుడు నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్థులకు తాము అండగా ఉన్నామని ప్రజలకు సందేశమిస్తూ రాజకీయాల్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కావట్లేదని దుయ్యబట్టారు. ఏడాది పరిపాలన అంతా బాగుందన్నారు. మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. గత వైకాపా ప్రభుత్వంలో తప్పులు చేసిన పెద్దలు ఇంకా బయటే తిరగటం సబబు కాదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఏ తప్పూ చేయకుండానే తెలుగుదేశం నాయకుల్ని గత ప్రభుత్వంలో జైలుకు పంపారని మంత్రి సంధ్యారాణి గుర్తు చేశారు. మనల్ని అన్యాయంగా వేధించారని మనమూ - మిగతా3లో



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం
- తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయి
- ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుంది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నాం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఖమ్మం**

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు - మిగతా3లో



## బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదం

- తొక్కిసలాటలో 10మంది మృతి
- 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే.

# వి.కోటలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సుడిగాలి పర్యటన



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04 :**
పలమనేర్ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి బుధవారం వీ.కోటమండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. మండలంలోని చింతమాకుల పల్లె పంచాయితీ తెలుగుదేశం పార్టీ వైస్ చైర్మన్ రమేష్ సోదరుడు గంగాధరం ఏ చిట్టి వివాహ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి గృహప్రవేశకార్యక్రమంలో స్థానిక నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు.అదేవిధంగా చింతమాకులపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డిఏ చిట్టి కుమారుడు రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం హైదరాబాదులో మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేవారి కుటుంబీకులను కలసి పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు రాంబాబు, సూపర్ బజార్ ఉపాధ్యక్షులు సుధాకర్, యువ నాయకులు ధీరజ్, శబరిష్, మరియు హరి, మురుగేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వి కోటలో విత్తన కాయల పంపిణీ పండుగ




**వీకోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్04:**
రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వేరుశనగ విత్తన కాయల పంపిణీల భాగంగా వీ.కోట మండలంలోని అనేక గ్రామపంచాయతీ కేంద్రాలలో వేరుచెనగ విత్తన కాయల పంపిణీ ప్రజాప్రతినిధులు ప్రారంభించినారు. అందులో భాగంగా వీకోట మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కుంబార్ల పల్లి గ్రామపంచాయతీ రైతు సేవాకేంద్రంలో కాయలపంపిణీని ఒక పండగ వాతావరణం తలపించే విధంగా ఏర్పాటు చేయిం చి రైతులకుపంపిణీ చేసినారు. ఈ సందర్భంగా గేయం రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటువంటి ఖరీఫ్ సీజన్ విత్తనాలను ప్రతిరైతు తమ పొలా లలో చెల్లి సద్వినియోగ పరచుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రైతుకు ఇవ్వాల్సిన పంటసబ్సిడీ రూపాయలను తొందరగా రైతుల అకౌంట్లోనికి జమ చేసారని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారిని, సచివాలయ ఉద్యోగస్తులు, కుంబార్లపల్లి పంచాయతీ గ్రామాలలోని రైతులు, మహిళా రైతులు, తెలుగుదేశం పార్టీ, జనసేనపార్టీ, బిజెపి పార్టీ కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 5 నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**
వేరుశనగ విత్తనాలు ఈనెల 6 నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిని జ్యోతమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల నందు వేరుసెనగ కాయలు కావాల్సిన రైతులు వారి పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 5న గడ్డంవారిపల్లి 6న దుర్గ సముద్రంచారాల ఏ కొత్తకోట కాగతి కాటి పేరిలధిగం పందిళ్ళపల్లి 8న చౌడేపల్లి పరికిదొన 9న కొండా మరి వెంగళపల్లి 10న చింతమాకులపల్లి దిగువపల్లి రైతు సేవ కేంద్రాల నందు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. మండలానికి 1059 క్వింటాళ్లు వేరుసెనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు 30 కిలోల బస్తా 40% సబ్సిడీ పోను రూ 1674లు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంట సాగు చేసే రైతులు మాత్రమే విత్తనకాయలు తీసుకోవాలని కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు వారి ఫోన్ రైతుసేవ కేంద్రాలకు తీసుకుని నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

# హర్షల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 04:**
హర్షల్ ఫౌండేషన్ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్ద కొండా మరికి చెందిన గౌడప్పగారి చిన్న రెడ్డప్ప వర్ధంతి సందర్భంగా పుంగనూరు లోని తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో చౌడేపల్లి బస్టాండ్ నందు అన్న దానం కార్యక్రమాన్ని నిర్వహించారు. హర్షల్ ఫౌండేషన్ సభ్యులు అనురాధ సంతోష్ తెలుగు తల్లి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రేవతి దాత శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాతలను పలువురు సన్మానించారు.

# ప్రభుత్వ కళాశాలలో యోగాంధ్ర ఉత్సవాలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**



స్థానిక ప్రభుత్వ కళాశాలలో జూన్21 అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ జయప్రకాష్ యోగ ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యము యోగావల్ల కలిగేలాభాలను విద్యా ర్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో క్షయ ముక్తభారత్ ర్యాలీ

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ప్రెస్, జూన్ 04:**



ఆరోగ్యకేంద్రంఆధ్వర్యంలో క్షయముక్త భారత్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి పవన్ కుమార్ ప్రసంగిస్తూ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది. ప్రతి ఇంటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులు మధుమేహ వ్యాధి మద్యం సేవించడం, పొగతాగడం వంటి వారిని గుర్తించి వారికి క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అనుమా నితులను క్షయపరీక్షలుచేయించి నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తీసుకువెళ్లేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి





**ట్రాన్స్ కో,డిఆర్డిఏ బ్యాంకర్ల సమన్వయంతో లక్ష్యాల సాధనకు కృషి చేయండి**

**అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు చొరవ చూపండి**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 04:**
ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో సోలార్ రూఫ్ టాఫ్ నిర్మించుకోవడం పై మరింత అవగాహన కల్పించడంతో పాటు వీటి ఏర్పాటుకు మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్ కో, నెడ్ క్యాప్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుకు సంబంధించి ట్రాన్స్ కో, నెడ్ క్యాప్, జిల్లా పరిషత్, రెస్కో, డిఆర్డిఏ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి రెండవ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాఫ్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ తో ఇంటి అవసరాలను తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునని, ఈ విషయం పై అవగాహన ఉన్నప్పటికీ మొదట మొత్తం నగదును చెల్లించి తరు వాత ప్రభుత్వం రాయితీ పొందే అంశం పై వినియోగదారు లకు ఉన్న సందేహాలను పూర్తి స్థాయిలో నివృత్తి చేసేందుకు మండల, గ్రామ స్థాయిలో కమిటీ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయి కమిటీలో డిఆర్డిఏ ఏపిఓలు, ట్రాన్స్‌కో ఏఈలు, బ్యాంకర్లు ఒక కమిటీగా ఏర్పాటు కావాలని, అలాగే గ్రామ స్థాయిలో కూడా సచివాలయ సిబ్బంది డిఆర్డిఏ, మెప్మా వారి సిబ్బందితో సంబంధిత బ్యాంకుల అధికారులతో కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. సోలార్ రూఫ్ టాఫ్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వినియోగదారులకు వ్యక్తిగతంగా కమిటీ వారు మాట్లాడి వారికి అవసరమైన ఋణ సహాయం నిమిత్తం సంఘాలలోని మహిళలకు స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్‌ల ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టడంలో భాగంగా మొదట కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అవకాశమున్న మేర సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అన్ని శాఖల జిల్లా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ ఈ ఇస్మాయిల్, నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్,జెడ్పి సిఈఓ రవి కుమార్ నాయుడు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, డిపిఓ సుధాకర్ రావు, రెస్కో ఎండి సోమ శేఖర్, కమిటీ సభ్యులు బంగారు పాలెం జెడ్పిటిసి సోమ శేఖర్, తదిత రులు పాల్గొన్నారు.

# 40 శాతం రాయతీ ద్వారా వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**
కుప్పంనియోజకవర్గం గుడిపల్లి మండలంలోని రైతుసేవాకేంద్రంలో బుధవారంరోజు వేరుశనగ విత్తనపంపిణీ కార్యక్రమం ప్రజా ప్రతినిధులచేత ప్రారంభించడం జరిగింది. గుడుపల్లి మండలంలో ఈ ఖరీఫ్ 2025 సీజన్‌కి గాను 6 వేరుశనగ సబ్సిడి పై రైతు సేవాకేంద్రాలలో బయోమెట్రిక్ విధా నంలో రైతులకు మొబైల్ నంబర్, ఆధార్, పట్టాదారు పాస్ బుక్,1 బి, జిరాక్స్‌లు తీసుకోని రైతులువారికి సంబంధించిన రైతు సేవాకేంద్రాలలో షెడ్యూల్ ప్రకారం ఇవ్వడం జరుగుతుంది. అని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. రైతు ఒక 30కేజీల బ్యాగుకు 40 శాతము సబ్సిడీ పోను, రూ.1674 చెల్లించవలసి ఉంటుందన్నారు. కావున దయచేసి,ఈ అవకాశాన్ని అవసరమైన రైతులు ఉప యోగించుకోవాలని తెలిపారు. కచ్చితంగా వేరుశనగ విత్తనాలు తీసుకున్న ప్రతి ఒక్క రైతు కూడా పంటవేసి,పంట నమో దు చేసుకోవాలని లేకపోతే ప్రభుత్వం ద్వారా ఇచ్చే పథకాలు మరి ముఖ్యంగా అన్నదాత సుఖీభవకి అనర్హులు అవుతారని తెలిపారు అదేవిధంగా విత్తనాలు పొలంలో వేసేముందుగా రైతులు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని, ఎకరాకు 55 కిలోల వేరుశనగ విత్తనాలు వేసుకోవాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతిని ధులు,అధికారులు, రైతులు, రైతు సేవా సిబ్బంది, పాల్గొన్నారు.

## జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను

# అంగన్వాడీలు జయప్రదం చేయాలి

**జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు పిలుపు**

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**



కేంద్రంలోని మోడీప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, అంగ న్వాడీలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని జూలై 9న జరిగే సమ్మెను అంగన్వాడిలందరూపాల్గొని జయప్రదం చేయాలని బుధవారం కుప్పం అంగన్వాడీల జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత అధ్యక్షతనజరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పాటు చేసి50 సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ సంస్థాగతం చేయాలని అంగన్వాఇడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా నిర్లక్ష్యం చేయడం దారుణం అన్నారు. ఐసిడిఎస్ లక్ష్యం నెరవేరడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీల వేతనాలు పెంచకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. అంగనవాడి సెంటర్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పై ఒత్తిడి తీసుకువచ్చి అంగన్వాడీలకు వేతనాలు పెరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగ న్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలుచేయాలని తెలంగాణ లో లాగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్‌గా మార్చే జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించి, అన్ని రకాల యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి అందరికీ సూపర్వైజర్ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు సమస్యలు పరిష్కారం కోసం అంగన్వాడీలందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపుని చ్చారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో అంగన్వాడీ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్వాడీ యూనియన్ సీనియర్ నాయకురాలు ప్రమీల, ప్రాజెక్టు కార్యదర్శి సరళ నాయకులు కస్తూరి, మునిరత్న, అనిత, భారతి, కృష్ణవేణి, లక్ష్మి, నందిని, లావణ్య, కాంచనలతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో అమలులో విఫలం

# మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 04:**
అన్నమయ్య జిల్లా పీలేరు కూటమి పార్టీలు బూటకపు మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చాయని పీలేరు మాజీఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, ఆరోపించారు. వైసిపి రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు బుధవారం పీలేరు దర్గా వద్ద నుండి ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు నిరసనర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక పరిస్థితి సరిగా లేదంటూ కుంటి సాకులు చెబుతున్నారని, సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూడా అమలు చేయడం లేదని, పాఠశాలల్లో చదివే పిల్లలకు 15000 ఇవ్వడం లేదని విమర్శించారు. ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోయినా జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. సంక్షేమ పథకాలకు వెన్నుపోటు పొడిచారని పేదలను మోసం చేశారని ఆయన దుయ్య బట్టారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి హరీష్ రెడ్డి, ఇక్బాల్ అహ్మద్, హరి ప్రసాద్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, జడ్పిటిసి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ హబీబ్ బాషా, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, చక్రధర్, అబ్దుల్ కలీం, ద్వారకనాథరెడ్డి, లోకనాథ్ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, ఉదయ్ సునీల్ రెడ్డి, ఆనంద్, నియోజవర్గ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# పాటపేట గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**



బైరెడ్డిపల్లి మండలం పాతపేట గ్రామంలో జరిగిన గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం తెలియజేయగా జాతర కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు. వర్షాలు మరింత విరివిగా కురిసే పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం శెట్టితో పాటు బైరెడ్డిపల్లి వీ,కోట మండల నాయకులు రంగనాథ్, రాంబాబు, ధీరజ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నేహమంటే భరోసా స్నేహమంటే సహాయం అని నిరూపించిన జడ్పీబాయ్స్ స్కూల్ పూర్వవిద్యార్థులు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్**
శ్రీకాళహస్తి పట్నంలోని సీనియర్ వార్త విలేఖరి మెహర్ కుమార్ చనిపోయారు అని అందరికి తెలిసిందే. దీనిలో భాగంగా శ్రీకాళహస్తి జడ్పీ బాయ్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో సుమారు 90,000 వాళ్ళ తల్లికి బుధవారం అందించారు. అలాగే తల్లికి మెహర్ స్నేహితులంతా భరోసాని అందించి ముమ్ముందు మీకే సహాయ సహకార అందిస్తామని తెలిపారు.

# యోగేంద్ర పోస్టర్ ఆవిష్కరణ

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**



అన్నమయ్యజిల్లా పీలేరు యోగాంధ్ర పోస్టర్ను ఎమ్మార్వో భీమేశ్వరరావు ఎంపీడీవో పంచాయతీ ఈవో గురు మోహన ఆవిష్కరించారు. యోగమాస్టర్స్ పి.వి.ఎస్ లక్ష్మి, రాయలసుధాకర్ రాయలు వీఆర్వోలు మండలస్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. ఈనెల ఏడవ తేదీన జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగ బోయే యోగాంధ్ర కార్యక్రమాన్ని 1500 మందితో విజయవంతంగా నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగినది.

మీ ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# మంత్రులు దూకుడు పెంచాలి..

-మొదటిపేజీ తరువాయి

వేధించటం సరికాదన్న చంద్రబాబు.. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుపుతామన్నారు. నేరం రుజువైతే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ కక్ష సాధింపులు మన ధోరణి కాదని.. ఈ తేడాను ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. పోలవరం - బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని సీఎం తెలిపారు.

క్యాబినెట్ నిర్ణయాలివే..

సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం

వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, రాయతీల కల్పనకు క్యాబినెట్ ఆమోదం

రక్షితనీటి సరఫరాకు శ్రీకాకుళంలో రూ.5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆమోదం

కుప్పంలో రూ.8.22 కోట్లు వయబిలిటి గ్యాప్‌ఫండ్ విడుదలకు ఆమోదం


సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకే కేబినెట్ ఆమోదం.

1 ఫిబ్రవరి 2025 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు

248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదం

వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తెచ్చిన జీవోకు కేబినెట్ ఆమోదం

పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం



మహిళలు రాత్రిపూట కూడా పనిచేసే చట్టసవరణకు ఆమోదం. రాత్రిపూట పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలి.

# రాజకీయల్లో రగడ!

-మొదటిపేజీ తరువాయి

ఆశావహ ఎమ్మెల్యేలు.. కేబినెట్‌లో బెర్తు కేటాయించకపోతే తమ దారి తాము చూసుకుంటామని సన్నిహితుల వద్ద నిరసన గళం విన్పించినట్టుగా బయటకు రావడం పార్టీలో కలకలం రేపింది. మరోవైపు పదవుల లొల్లి కూడా ఆ పార్టీని కుదిపేస్తోంది. చాలా కాలం తర్వాత నియమించిన కమిటీల్లో కొంత సామాజిక న్యాయ కోణం కనిపించినా సీనియర్లు, జూనియర్లు అనే విభేదాలు మరింత పెరిగాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూనియర్లకు, ప్యారాచూట్ల (బయటి పార్టీల నుంచి వచ్చిన వారికి)కు కమిటీల్లో ప్రాధాన్యతనిచ్చారనే అసంతృప్తి వ్యక్తమవుతుండటం గమనార్హం. ఇంకోవైపు మహిళా కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లోని టీపీసీసీ అధ్యక్షుడి చాంబర్ ముందు తమకు ప్రాధాన్యత లభించడం లేదంటూ ధర్నాకు దిగడం కూడా చర్చనీయాంశమైంది. అయితే, టీ కప్పులో తుపాను మాదిరి ఆ వివాదం ముగిసినా, పార్టీలో ప్రాధాన్యత అంశం అంతర్గతంగా అగ్గిని రాజేస్తూనే ఉంది.

**మంత్రులపై ఫిర్యాదులు..పాలనపై విమర్శలు**

సీఎంకు, మంత్రులకు మధ్య సఖ్యత లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా, కొందరు మంత్రుల పనితీరుపై ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేసేంతవరకు పరిస్థితి వెళ్లిపోయింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కూడా పార్టీలో తీవ్రంగానే చర్చ జరుగుతోంది. ఎంత చేసినా ప్రజల మన్ననలు రావడం లేదని పార్టీ నేతలు చెబుతుంటే, తాము చేసినవన్నీ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదనే అభిప్రాయంతో ప్రభుత్వ పెద్దలున్నారు. ఈ క్రమంలో వీలున్నంత త్వరగా మంత్రివర్గ విస్తరణ జరగాల్సిందేనని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి పట్టు నిరూపించుకోకపోతే పార్టీ గ్రాఫ్ డౌన్ కావడం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నేతలే బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

**గులాబీకి 'కుటుంబ ముల్లే' పోటు**

బీఆర్ఎస్‌లో ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. పార్టీలో ఆమె ఇప్పుడు రె'బెల్స్' మోగిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌ను విమర్శించకుండా వ్యూహాత్మక వ్యాఖ్యలు చేస్తూ, ప్రశ్నలు వేస్తూ గులాబీ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి వరంగల్‌లో పార్టీ రజతోత్సవ సభకు ముందు అంతర్గత చర్చలకే పరిమితమైన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చారు. సభ నిర్వహణ గురించి కేసీఆర్‌కు స్వదస్తూరితో రాసిన లేఖ బీఆర్ఎస్‌లో అశాంతిని బహిర్గతం చేసింది. ఆ లేఖ లీక్ కావడం, ఆ లీకేజీ వెనుక ఎవరున్నారన్న దానిపై చర్చోప చర్చలు జరుగుతుండడం అటు బీఆర్ఎస్‌నే కాదు, ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాలను కూడా కుదిపేశాయి. కేసీఆర్ దేవుడని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలున్నాయంటూ కవిత చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అమెరికా నుంచి వచ్చిన వెంటనే శంషాబాద్ విమానాశ్రయంలోనే ఆమె పేల్చిన బాంబు మంటలు ఇంకా చల్లారలేదు. ఆ తర్వాత ఆమె స్పీడ్ మరింత పెంచారు.

**ఇష్టాగోష్టిలో బాంబు పేల్చిన కవిత**

మీడియాతో ఇష్టాగోష్టి పేరుతో కవిత మరో రాజకీయ ఆటం బాంబు పేల్చారు. బీజేపీతో పొత్తు కుదుర్చుకునేందుకు బీఆర్ఎస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని అడ్డుకుం టున్నందుకే తనను బయటకు పంపాలని చూస్తున్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యలు అధినేత కేసీఆర్‌ను సైతం ఇరకాటంలో పడేశాయి. అంతటితో ఆగని కవిత తెలంగాణ జాగృతి పేరుతో బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌తో సమాంతరంగా జాగృతిని తీసుకెళ్తానని చెప్పకనే చెపుతున్న ఆమె, పరోక్షంగా పార్టీని సవాల్ చేస్తూ ధర్నాకు దిగుతున్నారు. కేసీఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడానికి నిరసనగా చేపడుతున్న ధర్నాతో.. బీఆర్ఎస్ చేయలేని పనిని తాను చేస్తున్నానని పార్టీ కేడర్‌కు సంకేతాలిచ్చే ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఈ కుటుంబ పంచాయతీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. ఇలావుండగా.. ఎప్పుడూ లేని విధంగా ఇటీవల హరీశ్‌రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడం కూడా అటు బీఆర్ఎస్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది. ఇంత జరుగుతున్నా.. కేటీఆర్ నాయకత్వాన్ని ప్రశ్నించే రీతిలో కవిత అస్త్రాలు సంధిస్తున్నా కేసీఆర్ మాత్రం మౌన ముద్రలోనే ఉండడం గమనార్హం.

**కమలం.. కలహాల కాపురం**

సాధారణంగా బీజేపీలో అంతర్గత విభేదాలు బహిర్గతం కావు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ భావజాలంతో నడిచే ఆ పార్టీలో ఎంతటి వివాదాలు, భిన్నాభిప్రాయాలైనా లోలోపలే పరిష్కరించుకుంటారు. కానీ తెలంగాణ బీజేపీలో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రూపులుగా విడిపోయి వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని, ఎంపీల్లోని ఏ ఇద్దరూ ఒక్కచోట కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి లేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక విషయంలో పెద్ద రచ్చే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతగా అంటే అసలు ఏ నాయకుడిని ఎంపిక చేయాలో పార్టీ అధిష్టానానికి కూడా అంతుపట్టనంతగా ఈ పదవి కోసం నేతలు పోట్లాడుకుంటున్నట్టు బీజేపీలో జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది తర్వాత కూడా కిషన్‌రెడ్డినే రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారంటే ఆ పార్టీలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక వ్యవహారంలోనూ బహిరంగ విమర్శలు వ్యక్తమయ్యాయి.

**రాజాసింగ్ టార్గెట్ ఎవరో?**

రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా, ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రచ్చ రచ్చ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యి, ఆ తర్వాత మళ్లీ పార్టీలోకి వచ్చి కమలం గుర్తుపైనే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అయితే, ఈసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజాసింగ్ స్టైల్ మార్చారు. ఎప్పటిలాగా ఎంఐఎంను కాకుండా ఈసారి సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద చర్చకే దారి తీస్తున్నాయి. 'మా పార్టీ నేతలకు ప్యాకేజీలు ఇస్తే ఏ పార్టీనయినా విలీనం చేసుకుంటారు..' అంటూ ఆయన వ్యాఖ్యానించడం తీవ్ర దుమారాన్ని రేపింది. ఆయన్ను మరోమారు సస్పెండ్ చేస్తారనేంత వరకు ఈ వ్యవహారం వెళ్లింది. అయితే ఆ అంశంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. తనను సస్పెండ్ చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయట పెడతానంటూ హెచ్చరించడం పార్టీ నేతలను ఇరకాటంలో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆయన అసలు రాష్ట్ర పార్టీలో ఎవరిని టార్గెట్ చేశారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుడి ఎంపిక, పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో.. అధిష్టానం పట్టీపట్టనట్టుగా ఉండటం, ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్ అవుతోంది. ఈ విధంగా.. ఎన్నికలకు మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పుడే ఈ మూడు ప్రధాన పార్టీల్లో జరుగుతున్న లొల్లి, అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎంత తీవ్రంగా మారుతుందోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# గ్రేటర్ రేషన్ కార్డుల దందా

**హైదరాబాద్ :** రేషన్ కార్డుల కోసం ఇప్పుడు ప్రజలు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన పౌరసరఫరాల అధికారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో 30 శాతం కమీషన్లు ఇస్తేనే పనులు చేస్తున్నారంటూ పలువురు రాష్ట్ర మంత్రులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మేమేం తక్కువ తిన్నామా అంటూ కొందరు అధికారులు సైతం వారిని ఆదర్శంగా తీసుకొని అవినీతి దందాకు తెరలేపారు. ప్రతి రోజూ అందినకాడికి దండుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొందరు సివిల్ సప్లై ఉద్యోగులతో పాటు పలువురు దళారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా కావాల్సింది ప్రధానంగా రేషన్ కార్డు. ప్రతి పేద, నిరు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు అనేది అవసరం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలనే ఉద్దేశంతో మీసేవ సెంటర్ల ఆన్‌లైన్ చేసుకొని పౌరసరఫరాల కార్యాలయాల్లో వాటిని వెరిఫికేషన్ చేసి వెంటనే కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే దీనికి భిన్నంగా పౌరసరఫరాల అధికారులు వ్యవహరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం గత ఏడాది నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. వాటి విచారణను మాత్రం పౌరసరఫరాల అధికారులు జీహెచ్ఎంసీకి అప్పగించించారు. కొత్తగా కార్డు కావాలనుకునే వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవసరం లేదంటూ అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే రెండు శాఖల అధికారుల సమన్వయ లోపంతో తీరా ప్రజా పాలన దరఖాస్తులను పక్కన పెట్టి జీహెచ్ఎంసీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కూడా తాజాగా మరో సారి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలతో పాటు కొత్తగా రేషన్ కార్డు కావాలనుకునే వారు, కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే వారు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే వీరిది అవసరం..ఇదే మనకు అవకాశంగా భావించిన కొంత మంది పౌరసరఫరాల అధికారులు కొందరు దళారుల అండతో అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ భారీ అవినీతికి తెరలేపారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.కొత్త రేషన్ కార్డుల మంజూరులో ఏరియా సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్లు కీలకంగా మారారు. దీంతో అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అంబర్ పేట డివిజన్ పరిధిలోకి వచ్చే 2 ?3 ఇంటి నంబర్లకు సంబంధించిన విచారణ అధికారిగా విధులు నిర్వహిస్తోన్న ఓ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఇంటి వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అసలైన అర్హులను గుర్తించి వారికి కొత్త రేషకార్డులను మంజూరు చేయాల్సి ఉంటుంది?కానీ అతను అంబర్ పేట పటేల్ నగర్ హనుమాండ్ల గుడి వద్ద ఓ వారం రోజుల పాటు క్యాంపు ఏర్పాటు చేసుకొని తూతూ మంత్రంగా విచారణ చేపట్టి వదిలేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి విచారణ పేరుతో వెళ్లి ఏదో కారణం చూపిస్తూ మీకు కార్డు రాదంటూ బయపెడుతున్నారని దీంతో చేసేది ఏమీ లేక రూ.వెయ్యి లంచం ఇచ్చుకోక తప్పడం లేదని పలువురు పేరు తెలపడానికి ఇష్ట పడని అర్హులైన పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచం ఇచ్చే వారి పట్ల ప్రేమగా ఉంటూ .. నెలలు గడిచినా ఇంకా కొత్త కార్డు రాలేదని అర్హులైన దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు సర్కిల్ కార్యాలయం వద్దకు వెళితే బెదిరింపులకు పాల్పడుతూ సరైన సమాధానం చెప్పకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పాలనలో ఇది కామనే ?అంటూ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.ఈ అక్రమ దందాలో పలు పార్టీల నాయకులతో పాటు తాడు, బొంగరం, ఊరు పేరు లేని పొట్ట చీల్చితే అక్షరం రాని కొందరు విలేకరులు కూడా దళారులుగా మారి అందిన కాడికి దండుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డు వెంటనే ఇప్పిస్తామంటూ సదరు దళారులు మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులను లబ్ధిదారుల వద్ద తీసుకుని వారి వద్ద రూ.2వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అంబర్ పేట డివిజన్ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ తో కుమ్మక్కై ఓ ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లబ్ధిదారుల వద్ద తీసుకున్న డబ్బుల్లో రూ.వెయ్యి ఇన్ స్పెక్టర్ కు లంచంగా ఇవ్వడంతో అదే రోజు అనర్హులైనా ఎలాంటి విచారణ చేయకుండా వాటిని క్లియరెన్స్ చేస్తున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో వారికి కేవలం రెండు రోజుల్లోనే కొత్త కార్డులు మంజూరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొంతమంది నెలలు గడిచినా రేషన్ కార్డు మంజూరు కాకపోవడంతో తమకు కార్డు వస్తుందో ..రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకొని రేషన్ కార్డులు మంజూరు చేసే అధికారుల పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్‌కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెపితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబ సభ్యులు కట్టుకున్న ప్యాలెస్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు పెట్టె ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

## రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..

-మొదటిపేజీ తరువాయి

చెబితేనే తన ఫోన్ టాప్ చేసినట్టు రాధా కిషన్ రావు కన్ఫ్యూషన్ స్టేట్మెంట్‌లో చెప్పారన్నారు. తన ఫోన్ ట్యాప్ చేశారని రాధా కిషన్ రావు స్టేట్‌మెంట్‌తో క్లియర్‌గా తేలిందన్నారు. పక్కా సమాచారం ఉన్నా పోలీసులు ఆధారాల కోసం మూసీలో వెతికారన్నారు. ప్రభాకర్ రావు విచారణ తర్వాత ఎవరికి ఫిర్యాదు చేయాలో వాళ్లకి చేస్తానని.. తన ఫోన్ ట్యాప్ చేయడానికి ఇంటలిజెన్స్ అధికారులు ఎవరి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. తన ఫోన్ ట్యాప్ చేయకుండా తనకు సంబంధించిన ఆడియోలు మాజీ సీఎం కేసీఆర్‌కు ఎలా దొరికాయని నిలదీశారు. తాను రోహిత్ రెడ్డి మాట్లాడిన మాటలు కాల్ రికార్డింగ్ కావచ్చని.. కానీ సింహయాజి స్వామితో మాట్లాడిన కాల్స్ కూడా రికార్డింగేనా అని అడిగారు. ఫాం హౌస్ కేసు స్టేట్ సెంట్రల్ ఇష్యూ అని.. అందులో తాను బలైనట్లు తెలిపారు. ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆల్రెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయిందని.. జస్ట్ ఫార్మాలిటీస్ కోసం ప్రభాకర్ రావు ఇండియా వస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తానే చేయించాను అని ప్రభాకర్ రావు అంగీకరిస్తే కేసు అక్కడితో ముగుసినట్టే అని అన్నారు. 'నాకు ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు, మాజీ సీఎం కేసీఆర్ నుంచి ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పిస్తే చాలా విషయాలు బయటపెడతా' అని నందకుమార్ పేర్కొన్నారు.

## ఆలయ కమిటీ సభ్యులు టిడిపి యువనాయకుడు ఎస్.సి.వి దిలీప్‌కు ఘనస్వాగతం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**

శ్రీకాళహస్తిపట్టణంలో ఉన్న బంగారమ్మ తల్లి జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు తనయుడు టిడిపి యువనాయకుడు ఎస్.సి. వి దిలీప్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుదర్శన్ నాయుడు, ఢిల్లీ ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారమ్మ అమ్మవారికి సారె సమర్పించిన బొజ్జల బృందమ్మ







**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**

శ్రీకాళహస్తి బంగారమ్మతల్లి జాతర సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన బంగారమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి సారె సమర్పించి శ్రీకాళహస్తి ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకున్న బొజ్జల బృందమ్మ ,ముందుగా బొజ్జల బృందమ్మ స్వాగతం పలికిన బంగారమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, మల్లీశ్వరి, సుమతి, గోపినాథ్, వాసునాయుడు, మునిరాజా యాదవ్, హరి, కాద్దర్, బాలాజీరెడ్డి, అనిత, సునీత, అనూష, సుభాషిణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి అభివృద్ధి కోసం రెండో దశ

-మొదటిపేజీ తరువాయి

ఇలా ప్రభుత్వానికి ఊు పెరుగుతుంది అన్నారు. భూసమీకరణలో తీసుకున్న భూమిలో రైతులకు స్థలాలు కేటాయించగా సీఆర్డీఏకు 25 శాతమే మిగులుతాయన్నారు. ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీలకు 10,000 ఎకరాలు కావాలంటే 40,000 ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమీక్షా సమావేశం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్04:**



శ్రీకాళహస్తి డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు అధ్యక్షతన శ్రీకాళహస్తి నియోజక వర్గ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగ డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలను, ప్రజాసమస్యల పైఏవిధంగా ముందుకు తీసుకు వెళ్లాలి ఏవిధంగా పోరాడాలి అనిదిశా నిర్దేశంచేస్తూ ప్రతిఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలని తెలియ జేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘనచరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేదల పార్టీకాంగ్రెస్ పార్టీ అని పేద బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే అది ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఈనాడు భారతదేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందంటే నాడు కాంగ్రెస్ పార్టీ చేపట్టినటువంటి విధి విధానాలేనని, కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్ మండల యువజన అధ్యక్షుడు నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంటోనీ, కరీముల్లా, పఠాన్ అల్తాఫ్, షేక్ బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో సేవచేయు కార్మికులకు న్యాయంచేయండి కాంగ్రెస్ పార్టీ డిమాండ్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 04:**

శ్రీకాళహస్తి డిసిసి అధ్యక్షులు బాలగురువం బాబు శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి వార్లను శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం నందు పనిచేస్తున్నటువంటి సేవకులు వారికి జరిగిన అన్యాయాన్ని తెలియజేసి వారికి న్యాయం చేయాలని కోరారు. డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ దేవస్థానం నందు పనిచేస్తున్నటువంటి సేవకుల వివరాలు తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ తరఫున వారికి తగు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని వారికి అండగా ఉంటామని తెలియజేశారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి సేవకులను హఠాత్తుగా నిలిపివేసి వారి కుటుంబం మునుగడను ప్రశ్నార్థకము చేసినటువంటి నేపథ్యంలో వారికి కోర్టు నందు స్టే వుండినను వారికి ఆలయ అధికారులు తగు న్యాయం చేయకుండా వారిని తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్న కారణంగా సేవకులకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉండి వారికి న్యాయం చేయు వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అదేవిధంగా ఆలయ అధికారులు కూడా వీటిపై పూర్తి విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీతరఫున కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, అంటోని, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, కర్రీముల, ఫటాన్ అల్తాఫ్, షేక్ బబ్లు మరియు దేవస్థాన కార్మికులు పాల్గొన్నారు.

# చిన్న చేపలను కాదు.. తిమింగలాలను పట్టుకోండి

తాను రెండు కేసులను గమనించాను. మీరు వాటిని ముగింపునకు తీసుకెళ్లే వరకు నేను వేచి ఉన్నాను. ఈ ముగింపు అంటే మొదట, దోషులను శిక్షించాలి. రెండవది కేసు సూత్రధారిని కనుగొనాలి" అని సూచించారు. దానిపై తగిన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్న నిర్మలా సీతారామన్.., స్మగ్లింగ్ సిండికేట్‌ల సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఐ=× అధికారులను కోరారు. తక్కువ స్థాయి స్మగ్లింగ్ కార్యకర్తలను పట్టుకోవడంతో సంతృప్తి చెందడానికి బదులుగా, నేరానికి మూలకారణాన్ని కనుగొని కేసును ముగింపునకు తీసుకురావాలని నిర్మలా సీతారామన్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు చెప్పారు. ఇక్కడ, అక్కడ కేసులను గుర్తించడం మాత్రమే కాదు, మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించడమే లక్ష్యం కావాలి. నేను ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పాను. మీరు చిన్న చేపలను పట్టుకోవడంలో అర్థం లేదు. మన ఫిషింగ్ లైన్ పట్టలేని పెద్ద తిమింగలాలు ఉన్నాయి" అని డిఆర్ఐ కొత్త ప్రధాన కార్యాలయ



ప్రారంభోత్సవంలో మంత్రి అన్నారు. మనం మొత్తం స్మగ్లింగ్ గొలుసును ఒక విలువ గొలుసులాగా ట్రాక్ చేసి చర్య తీసుకోవాలి. ఇది అంత సులభం కాదు, కానీ మనం అంత లోతుగా వెళ్లాలి. కొన్ని స్మగ్లింగ్ కార్యకలాపాలను గుర్తించి ఆపదంలో మేము చాలా తెలివిగా వ్యవహరించాము. కానీ ఆ కేసులను సరిగ్గా అనుసరించడానికి మేము ఇబ్బంది పడుతున్నాము." తాను రెండు కేసులను గమనించాను. మీరు వాటిని ముగింపునకు తీసుకెళ్లే వరకు నేను వేచి ఉన్నాను. ఈ ముగింపు అంటే మొదట, దోషులను శిక్షించాలి. రెండవది కేసు సూత్రధారిని కనుగొనాలి" అని సూచించారు. "స్మగ్లింగ్ బయటపడినప్పుడు దాన్ని ఆపడం, దానిపై తగిన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఇది భయంతో చట్టాన్ని పాటిం చడం కంటే చట్టాన్ని గౌరవించి దానిని అనుసరించడానికి ప్రజలను ప్రోత్సహిస్తుంది" అని నిర్మలా సీతారామన్ ఐ=× అధికారులతో అన్నారు. ఒక చిన్న కేసును దర్యాప్తు చేస్తున్నప్పు డు పెద్ద కేసుగా దృష్టిలో ఉంచుకోండి. ఒక సంస్థ, ఒక వ్యక్తి, వారి ప్రవర్తన విధానాల గురించి అందుబాటులో ఉన్న అన్ని సమాచారాన్ని ఉపయోగించి దర్యాప్తు చేయండని అన్నారు.

### భారత్‌లో పన్నుల భారం ఎక్కువ
## ఎయిర్‌పోర్టు చార్జీలూ ఎక్కువే

భారత విమానయాన రంగం పై ప్రభుత్వం వి?ధిస్తున్న పన్నులపై ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. పన్నుల నిర్వచనంలోనూ స్పష్టత లేకుండా పోతోందని ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. ఈ విషయంలో స్పష్టత ఏర్పడితే తప్ప భారత్‌లో విమానయాన రంగం తన శక్తికి తగ్గట్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత విమానాశ్రయాల్లో వసూలు చేస్తున్న చార్జీలపైనా వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత ఎయిర్‌పోర్టుల్లో ఉన్నన్ని చార్జీలు లేవన్నారు. ఈ చార్జీలు విమానయాన సంస్థలకు భారం కాని స్థాయిలో ఉండాలన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా భారత్‌లో విమాన యాన రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోతుందని వాల్ష్ స్పష్టం చేశారు. విమానయానానికి సంబంధించి భారత్ అద్భుత అవకాశాల గని అని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వర్జిన్ అట్లాంటిక్ విమానయాన సంస్థ తెలిపింది. భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ నేపథ్యంలో సరుకు రవాణ కోసం భారత్‌కు మరిన్ని విమాన సర్వీసు




ప్రారంభించబోతున్నట్టు ఆ సంస్థ సీఈఓ షాయ్ వీస్ చెప్పారు. అమెరికా తర్వాత ప్రస్తుతం భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు. భారత్ నుంచి ప్రస్తుతం ఏటా తమ విమానాల ద్వారా 10 లక్షల మంది ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తన సాంకేతిక వ్యవస్థలను ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌తో ఆధునీకరించేం దుకు వర్జిన్ అట్లాంటిక్ సంస్థ టీసీఎసతో ఐఏటీఏ సదస్సు సందర్భంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

## జీఎస్టీ జరిమానా కట్టాల్సిందే

తనపై విధించిన రూ.273.50 కోట్ల జీఎస్టీ జరిమానాను సవాలు చేస్తూ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్ట్ తోసిపుచ్చింది. క్రిమి నల్ విచారణ తర్వాతే ఇలాంటి జరిమా నాలు విధించాలన్న పతంజలి వాదనతో న్యాయమూర్తులు శేఖర్ బి. సరాఫ్, విపిన్ చంద్ర దీక్షిత్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఏకీభవించ లేదు. క్రిమినల్ కోర్టు విచారణ అవసరం లేకుండానే సివిల్ వ్యాజ్యం ద్వారా జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 122 కింద పన్ను అధికారులు జరిమానాలు విధించవచ్చునని బెంచ్ తేల్చి చెప్పింది. జీఎస్టీ జరిమానా ప్రొసీడింగ్స్‌కు సివిల్ స్వభావం ఉన్నదని, కాబట్టి వాటిపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకోవచ్చునని వివరణ ఇచ్చింది. పతంజలి ఆయుర్వేదిక్ లిమిటెడ్‌కు హరిద్వార్ (ఉత్తరాఖండ్), సోనీపట్ (హర్యానా), అహ్మద్‌నగర్ (మహారాష్ట్ర)లో తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సంస్థల లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయంటూ అధికారులకు సమాచారం అందడంతో దర్యాప్తు జరిపారు. వస్తువులను సరఫరా చేయకుండా కేవలం కాగితాలపై పన్ను ఇన్వాయిస్‌లు చూపిందంటూ దర్యాప్తు సందర్భంగా ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఘజియాబాద్‌కు చెందిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీజీఐ) గత సంవత్సరం ఏప్రిల్ 19న పతంజలి ఆయుర్వేద్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 122 (1) కింద రూ.273.51 కోట్ల జరిమానాను అందులో ప్రతిపాదించారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 10న జారీ చేసిన ఉత్తర్వు ద్వారా పన్ను డిమాండ్లను ఉపసంహరించుకున్నారు.

# టీమిండియాతో సిరీస్.. ఇంగ్లండ్‌ను వెంటాడుతున్న బౌలింగ్ కష్టాలు!

ఇంగ్లండ్ జట్టుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను విజయంతో ఆరంభించాలనే కసితో ఉన్న ఆతిథ్య జట్టుకు బౌలింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పేసర్ మార్క్‌వుడ్, జోఫ్రా ఆర్చర్ గాయపడ్డారు. క్రిస్ వోక్స్ సైతం ఫిట్‌నెస్ కోసం నానా పాట్లు పడుతున్నాడు. అంతలోనే యువ పేసర్ గస్ అట్కిన్సన్ సైతం గాయం పడ్డాడు. దాంతో ఇండియాతో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. కండరాల గాయంతో బాధపడుతున్న ఈ స్పీడ్‌స్టర్ కోలుకునేందుకు సమయం పట్టనుంది. సో.. జూన్ 20 మొదలయ్యే మొదటి టెస్టులో అతడు ఆడడం దాదాపు అసాధ్యమే. 'యువ పేసర్ గస్ అట్కిన్సన్ కుడి కాలి తొడకండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఇండియాతో జూన్ 20న జరుగబోయే తొలి టెస్టుకు దూరమయ్యే అవకాశముంద'ని ఇంగ్లండ్ బోర్డు తెలిపింది. స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో అట్కిన్సన్ గాయపడ్డాడు. దాంతో.. అతడు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు.




ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లో భాగంగా టీమిండియాతో సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ తొలి టెస్టులోపు అట్కిన్సన్ కోలుకొని, ఫిట్‌నెస్ సాధించకుంటే ఇంగ్లండ్‌కు వైవిధ్యమైన పేస్ బౌలర్ కొరత ఏర్పడనుంది. నిరుడు వేసవిలో అరంగేట్రం చేసిన అట్కిన్సన్ 12 మ్యాచుల్లోనే 55 వికెట్లు పడగొట్టాడు.

**గిల్ సారథ్యంలో..**

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు జూన్‌లో ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. లీడ్స్‌లోని హెడింగ్లే మైదానంలో జూన్ 20న ఇరుజట్ల మధ్య తొలి టెస్టుతో సిరీస్ మొదలవ్వనుంది. జూలై 2న రెండో టెస్టు, జూలై 10న మూడోది, జూలై 23న నాలుగో మ్యాచ్, జూలై 31న ఐదో టెస్టులో భారత్, ఇంగ్లండ్ తలపడుతాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఇరుజట్లకు ఇదే మొదటి సిరీస్. కాబట్టి.. ఇరుజట్లు విజయం కోసం తమ అస్త్రాలను ఉపయోగించనున్నాయి. సిరీస్ కొల్లగొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నాయి. కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి సీనియర్లు వీడ్కోలు పలికిన నేపథ్యంలో.. కుర్రాళ్లతో నిండిన జట్టును గిల్ ఎలా నడిపిస్తాడు అనేది ఆసక్తికరంగా మారనుంది.

# చైనాలో ఆసియా కప్.. ట్రోఫీ విజేతకే వరల్డ్ కప్ బెర్తు!

మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. చైనాలోని హంగ్జౌ వేదికగా సెప్టెంబర్ 5 నుంచి ఈ మెగా టోర్నీ షురూ కానుంది. 10 రోజుల పాటు జరుగనున్న ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. గ్రూప్ బీలో చోటు దక్కించుకున్న భారత జట్టు తొలి పోరులో థాయ్‌లాండ్‌ను ఢీ కొట్టనుందని బుధవారం హాకీ ఇండియా వెల్లడించింది. గత ఎడిషన్‌లో కాంస్యం కొల్లగొట్టిన టీమిండియా ఈసారి పసిడిపై గురి పెట్టింది. మరో విషయం ఏంటంటే.. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు నేరుగా అర్హత సాధించనుంది. సో.. భారత జట్టు ఈ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే కసితో ఉంది.

**సెప్టెంబర్ 6న జపాన్‌తో..**

ఆసియా కప్ పోటీలకు అర్హత సాధించిన జట్లను గ్రూప్ ఏ, గ్రూప్ బీలుగా విభజించారు నిర్వాహకులు. పూల్ %-% ఏలో చైనా, కొరియా, మలేషియా, చైనీస్ తైపీ జట్లకు చోటు దక్కింది. పూల్ %-% బీలో భారత్, జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో భారత జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. సెప్టెంబర్ 6న డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్, సెప్టెంబర్ 8న సింగపూర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది టీమిండియా. 'పూల్ బీలో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌తో మ్యాచ్ మాకు పెద్ద సవాలే. కానీ, ఆరంభంలోనే కఠిన ప్రత్యర్థిని ఎదుర్కోవడం ద్వారా మా క్రీడాకారిణుల నైపుణ్యాలు మెరుగుపడతాయి. ప్రస్తుతానికి బాగా ఆడడంపైనా, క్రమశిక్షణతో ఉండడం మీద మాత్రమే మేము దృష్టి పెడుతున్నాం. ఒక్కో మ్యాచ్ గెలుస్తూ ముందుకు సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫైనల్‌కు చేరడంతో పాటు ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్నాం. తద్వారా 2026 మహిళల




ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించాలనేది మా ప్రధాన ఉద్దేశం' అని భారత సారథి సలీమా టెటె వెల్లడించింది. 2017లో చివరిసారిగా భారత జట్టు ఆసియా కప్ విజేతగా నిలిచింది.

## స్పోర్ట్స్

### ఆర్సీబీ విజయోత్సవంలో పెను విషాదం?.. ఏడుగురి దుర్మరణం

బెంగళూరులో జరుగుతున్న ఆర్సీబీ విజయోత్సవ సంబురాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం జరగాల్సిన చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరగగడంతో ఏడుగురు మృతి



చెందినట్లు తెలుస్తుంది. పదుల సంఖ్యలో గాయపడ్డారని సమాచారం. ఇంకా పలువురి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. స్టేడియంలోకి ఒక్కసారిగా భారీ సంఖ్యలో అభిమానులు దూసుకురావడంతో ఈ ప్రమాదం? సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. జనాలను అదుపు చేసే క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారని తెలుస్తుంది. స్టేడియం బయట విషాద ఛాయలు అలుముకున్నా లోపల ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం మాత్రం యధాతథంగా కొనసాగింది. ఆర్సీబీ ఆటగాళ్లంతా వేదికపై వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దరామయ్య చేతుల మీదుగానే ఆటగాళ్లను సన్మానం జరగాల్సి ఉంది. 18 ఏళ్ల తమ ఐపీఎల్ టైటిల్ కలను సాకారం చేసినందుకు గాను ఆర్సీబీ ఆటగాళ్లకు ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. తొలుత ఆర్సీబీ యాజమాన్యం ఓపెన్ టాప్ బస్‌లో విక్టరీ పరేడ్‌ను ప్లాన్ చేసింది. అయితే ఈ సమస్యలను ముందే ఊహించి పోలీసులు విక్టరీ పరేడ్‌కు అనుమతి నిరాకరించారు. అయినా అభిమానులు ఆటగాళ్ల సన్మాక కార్యక్రమం జరగాల్సిన చిన్నస్వామి స్టేడియం వద్దకు భారీగా చేరుకున్నారు. అభిమానులు ఈ స్థాయిలో తరలి రావడంతో పోలీసులు కంట్రోల్ చేయలేకపోయారు. లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి అదుపు తప్పినట్లు తెలుస్తుంది. కాగా, 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించింది. నిన్న (జూన్ 3) జరిగిన 2025 సీజన్ ఫైనల్లో ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో విజయం సాధించి, తొలిసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. 18 సీజన్ల ప్రస్థానంలో నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ నాలుగో ప్రయత్నంలో టైటిల్ కలను సాకారం చేసుకుంది. ఈ టైటిల్ కోసం ఆర్సీబీ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా 18 సీజన్లు వేచి చూడాల్సి వచ్చింది. 18 ఏళ్లుగా ఆర్సీబీకే ప్రాతినిథ్యం వహిస్తున్న విరాట్ ఎట్టకేలకు 18వ ఎడిషన్‌లో టైటిల్ కలను సాకారం చేసుకున్నాడు. ప్రతి సీజన్‌కు ముందు ఆర్సీబీ అభిమానులు ఈ సాలా కప్ నమదే అంటూ ఎదురుచూసేవారు. ఎట్టకేలకు వారి కల కూడా 18వ ప్రయత్నంలో సాకారమైంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143